క్లుప్తంగా

స్వాతంత్య్ర సమరయోధుడు ఓబన్నకు ఘన నివాళి



నర్సంపేట : పట్టణంలో వడ్డెర సంఘం ఆధ్వర్యంలో స్వాతంత్య్ర సమరయోధుడు వడ్డెర ఓబన్న 218వ జయంతి వేడుక శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి కార్యక్రమానికి హాజరై ఓబన్న విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించి మాట్లాడారు. ఓబన్న మొదటితరం స్వాతంత్య్ర పోరాటంలో క్రియాశీలకంగా పాల్గొన్నారని చెప్పారు. ఉయ్యాలవాడ నర్సింహారెడ్డి నాయకత్వంలో జరిగిన సాయుధ పోరాటంలో ఓబన్న దళాలకు స్ఫూర్తినిచ్చారని కొనియాడారు. కార్యక్రమంలో టీపీసీసీ సభ్యుడు పెండెం రామానంద్, కౌన్సిలర్ ఓర్సు అంజలి అశోక్, కాంగ్రెస్ ఓబీసీ చైర్మన్ ఓర్సు తిరుపతి, తదితరులు పాల్గొన్నారు.

గురుకుల ప్రవేశ పరీక్ష పోస్టర్ ఆవిష్కరణ



పర్వతగిరి : మండలంలోని జమాల్‌పురంలోని ట్రైబల్ వెల్ఫేర్ స్కూల్/కాలేజీలో గురుకుల ప్రవేశ పరీక్ష పోస్టర్‌ను ప్రిన్సిపాల్ శైలజారాణి శనివారం ఆవిష్కరించారు. అనంతరం తల్లిదండ్రులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. 2025–06 విద్యా సంవత్సరానికి సంబంధించి 5వ తరగతిలో ప్రవేశాలతోపాటు 6 నుంచి 9వ తరగతుల్లోని ఖాళీల భర్తీ కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. ఆసక్తి, అర్హత కలిగిన విద్యార్థులు ఫిబ్రవరి 1 వరకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అదే నెలలో పరీక్ష ఉంటుందని వివరించారు.

అనారోగ్యంతో మాజీ సర్పంచ్ మృతి


లింగారావు(ఫైల్)

దుగ్గొండి : మండలంలోని మైసంపల్లి మాజీ సర్పంచ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు లకిడె లింగారావు (72) అనారోగ్యంతో బాధపడుతూ శనివారం తెల్లవారుజామున మృతి చెందాడు. లింగారావు మృతదేహానికి నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి, ఆరె కుల సంక్షేమ సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు నాగుర్ల వెంకటేశ్వర్‌రావు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తోకల శ్రీనివాస్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఎర్రల బాబు, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ చెన్నూరి కిరణ్, తదితరులు పూలమాల వేసి నివాళులర్పించారు. బాధిత కుటుంబాన్ని ఓదార్చారు. మొదటి సర్పంచ్‌గా గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేశారని గుర్తు చేశారు.

కర్ణాటకలో పీజీతండా వాసి..


రాజు (ఫైల్)

దుగ్గొండి : మండలంలోని పీజీతండాకు చెందిన నూనావత్ రాజు (42) కర్ణాటకలో శుక్రవారం మృతి చెందాడు. రాజు మూడు నెలలుగా కర్ణాటకలోని మాన్యా జిల్లా కేంద్రంలోని సీసీఐలో కాంట్రాక్టు ఉద్యోగిగా పని చేస్తున్నాడు. రాజు శుక్రవారం గుండెపోటుకు గురి కాగా సహచర ఉద్యోగులు ఆస్పత్రికి తరలించారు. కాసేపటికే పరిస్థితి విషమించి మృతి చెందాడు. రాజు మృతదేహం పీజీతండాకు శనివారం సాయంత్రం చేరుకోగా మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి నివాళులర్పించి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. రాజు మృతితో గ్రామంలో విషాదం నెలకొంది. మృతుడి భార్య, ఇద్దరు పిల్లలున్నారు.

నివాళి



చెన్నారావుపేట : మండలంలోని అమీనాబాద్ తండాకు చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకుడు, మాజీ వార్డు సభ్యుడు ధారావత్ శంకర్ అనారోగ్యంతో మృతి చెందగా ఆయన మృతదేహానికి కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ సిద్దన రమేశ్, నెక్కొండ బ్లాక్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి మంద యాకయ్య గౌడ్ శనివారం నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. కార్యక్రమంలో కిసాన్ సెల్ మండల అధ్యక్షుడు సంపత్‌రెడ్డి, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బండి హరీశ్, మార్కెట్ డైరెక్టర్ చీర అశోక్, నాయకులు బానోతు రవికుమార్, ధారావత్ రాములు, కుమార్, తదితరులు పాల్గొన్నారు.

కొలిచిన వారికి కొంగుబంగారం

- రేపటి నుంచి పర్వతాల మల్లన్నకు బోనాలు, పట్నాలు
- ఉగాది వరకు ఉత్సవాలు


ఆశాలపల్లి శివారులోని ఆలయం


మల్లికార్జున స్వామి విగ్రహం

సంగెం : కొలిచిన వారికి కొంగుబంగారం అన్న కీర్తి మండలంలోని ఆశాలపల్లి శివారులోని పర్వతాల మల్లన్న (మల్లికార్జున స్వామి) సొంతమని చెప్పవచ్చు. కోటిమాయల మల్లన్నగా, కోటి వరాలిచ్చే దేవుడుగా ఆయన్ను ప్రజలు కొలుస్తారు. సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకుని రేపటి (సోమవారం) నుంచి పర్వతాల మల్లికార్జున స్వామికి బోనాలు, పట్నాలతో ప్రజలు పెద్ద ఎత్తున పూజలు నిర్వహించి మొక్కులు చెల్లిస్తారు.

కొన్ని వందల ఏళ్ల క్రితం మండలంలోని ఆశాలపల్లి శివారులో రెండు బండరాళ్ల నడుమ పర్వతాల మల్లికార్జున స్వామి వెలిశాడని చరిత్ర చెబుతోంది. నాడు భక్తులు అంగరంగ వైభవంగా పూజలు నిర్వహించడం ఆనవాయితీ. ఆశాలపల్లి, కాట్రపల్లి, గవిచర్ల గ్రామాల శివారులు కలిసిన చోట ఆశాలపల్లి పొలిమేరలో ఏటా మల్లన్న తీర్థం సాగేదని పెద్దలు చెబుతారు. పెద్ద పట్నాలు, బోనాలు, ఎడ్లబండ్లతో భక్తులు గుడి చుట్టూ ప్రదక్షిణ చేసి స్వామి వారి దర్శించుకుని తరించే వారని ప్రతీతి. కాట్రపల్లి, ఆశాలపల్లి ఒగ్గు పూజారుల నడుమ పొడచూపిన విభేదాలతో పూజలు మానివేయడంతో మల్లన్న అలిగి కొమురవెల్లికి వెళ్లిపోయాడని ప్రచారంలో ఉంది. ఆశాలపల్లికి చెందిన కూచన సమ్మయ్య కొందరు భక్తులతో కలిసి గ్రామస్తుల సహకారంతో నూతన ఆలయం నిర్మించడంతోపాటు మల్లికార్జునస్వామి విగ్రహాన్ని పునఃప్రతిష్ఠించారు. ప్రధాన ఆలయంతోపాటు కళ్యాణ మండపం, గణపతి, దత్తత్రాయే, అన్నపూర్ణేశ్వరీ దేవి, జంట నాగేంద్రస్వాములు, నవగ్రహాలు, ధ్వజస్తంభం ఏర్పాటు చేశారు. దీంతో ఏటా ఉత్సవాలు నిర్వహించే ఆనవాయితీ కొనసాగుతోంది. సంకాంత్రిని పురస్కరించుకుని జాతర నిర్వహించడంతోపాటు పట్నాలు వేసి బోనాలతో మొక్కులు సమర్పించడం పరిపాటి. అలాగే ఎడ్లబండ్లు తిప్పడానికి చుట్టుపక్కల గ్రామాల ప్రజలు వస్తారు. మొక్కులు చెల్లిస్తారు. సంక్రాంతికి చిన్న పట్నం, మహాశివరాత్రికి పెద్దపట్నాలు వేస్తూ బోనాలతో మొక్కులు చెల్లించడానికి ప్రజల భారీ సంఖ్యలో తరలి వస్తారు. ఉత్సవాలు వచ్చే ఉగాది వరకు కొనసాగుతాయని ఆలయ కమిటీ చైర్మన్ కూచన సమ్మయ్య తెలిపారు.

ప్రభుత్వం సహకరిస్తే అభివృద్ధి



వరంగల్–నెక్కొండ ప్రధాన రహదారి నుంచి సుమారు కిలోమీటరు దూరంలో పర్వతాల మల్లికార్జున స్వామి ఉంది. దీనికి సీసీ రోడ్డు నిర్మించాల్సిన అవసరం ఉంది. ఆలయ ప్రాంగణంలో గ్రెనైట్, తాగునీటి కోసం బోర్‌బావి, వాటర్ ట్యాంకు, తదితర నిర్మాణాలు చేపట్టాల్సిన ఆవశ్యకత ఉంది. ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తే ఆలయం మరింత అభివృద్ధి చెందడంతోపాటు భక్తులకు మౌలిక వసతులు సమకూరుతాయి.

– కూచన సమ్మయ్య, ఆలయ కమిటీ చైర్మన్

ఆర్టీసీ అభివృద్ధిలో ఉద్యోగులు కీలకం


ఉద్యోగులకు ఆహార ప్యాకెట్లు అందజేస్తున్న డిపో మేనేజర్ ప్రసూనలక్ష్మి

- డిపో మేనేజర్ ప్రసూన లక్ష్మి

నర్సంపేట : ఆర్టీసీ అభివృద్ధిలో ఉద్యోగులు కీలకమని స్థానిక డిపో మేనేజర్ (డీఎం) ప్రసూన లక్ష్మి తెలిపారు. సంక్రాంతి పండుగ నేపథ్యంలో ఆర్టీసీ బస్సుల్లో రద్దీ భారీగా పెరగడంతో సంస్థ వీసీ, ఎండీ సజ్జనార్ ఆదేశాల మేరకు డిపో ఉద్యోగులకు శనివారం ఆమె ఆహార ప్యాకెట్లు అందజేసి మాట్లాడారు. ఉద్యోగుల సంక్షేమానికి ఆర్టీసీ ప్రాధాన్యమిస్తోందని తెలిపారు. సంక్రాంతి, ఇతర పండుగల సందర్భంగా ఆర్టీసీ ఉద్యోగులపై పని భారం పెరుగుతుందని తెలిపారు. ఈ క్రమంలో మరో రెండ్రోజులపాటు ఆర్టీసీ డిపో ఉద్యోగులకు భోజన సదుపాయం కల్పిస్తామని చెప్పారు. ఉద్యోగులు సంస్థ అభివృద్ధికి పాటుపడాలని ఆకాంక్షించారు. సంస్థను లాభాల బాటలో నడిపించే దిశగా ఉద్యోగులు బాధ్యతగా విధులు నిర్వర్తించాలని కోరారు. కార్యక్రమంలో అసిస్టెంట్ డిపో మేనేజర్ భవానీ, అసిస్టెంట్ ఇంజనీర్ ప్రభాకర్, సెక్యూరిటీ హెడ్ వీరారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పాకాల ఆడిటోరియంపై నిర్లక్ష్యం సరికాదు

- మాజీ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి

నర్సంపేట : పాకాల ఆడిటోరియం పనులు పూర్తి చేసి ప్రారంభించడంలో నిర్లక్ష్యం సరికాదని స్థానిక మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని పాకాల ఆడిటోరియంను నాయకులతో కలిసి శనివారం ఆయన సందర్శించి మాట్లాడారు. ఆడిటోరియం పనులు ఎక్కడ వేసిన గొంగలి అక్కడే అన్న చందంగా ఉన్నాయని ఆందోళన వెలిబుచ్చారు. బీఆర్ఎస్ హయాంలో రూ.6.50 కోట్ల వ్యయంతో సంస్కృతి సాంప్రదాయాలకు నిలువెత్తు నిదర్శనంగా ఆడిటోరియం చేపట్టి 95 శాతం పనులు పూర్తి చేసినట్లు తెలిపారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ఆడిటోరియంను పట్టించుకున్న దాఖలాల్లేవని చెప్పారు. ఆడిటోరియంను ప్రజలకు అందుబాటులోకి తీసుకురాకపోవడం సిగ్గుచేటన్నారు. టీయూఎఫ్ఐడీసీటీ నిధులన్నీ దొంగ జీఓలని ప్రచారం చేసిన నాయకులు వారి సొంత ఏజెన్సీతో ఎమ్మెల్యే ఎలా పనులు చేస్తున్నారని ప్రశ్నించారు. పట్టణంలో దాదాపు రూ.50 కోట్ల అభివృద్ధి పనులు చేపట్టగా కేవలం టెండర్లు దక్కించుకోవడంపైనే దృష్టి పెట్టారని ధ్వజమెత్తారు. ఇకనైనా నర్సంపేట అభివృద్ధిపై చొరవ చూపాలని కోరారు. లేనిపక్షంలో పనులు నిలిచిపోయిన చోట నిరసనలు తెలుపుతామని చెప్పారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ పట్టణ కమిటీ అధ్యక్షుడు నాగెల్లి వెంకటనారాయణ గౌడ్, మున్సిపల్ వైస్ చైర్మన్ మునిగాల వెంకట్‌రెడ్డి, నాయకులు నల్ల మనోహర్‌రెడ్డి, లెక్కల విద్యాసాగర్‌రెడ్డి, బీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు గోనె యువరాజు, తదితరులు పాల్గొన్నారు.

దొంగ అరెస్ట్

ఖానాపురం : దొంగను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై రఘుపతి తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. మండలంలోని అశోక్‌నగర్ గ్రామానికి చెందిన కల్లెపు వెంకటనారాయణ ఇంట్లో ఈనెల 6న 32 తులాల వెండి ఆభరణాలు, 13 గ్రాముల బంగారం, నగదును ఆగంతకుడు అపహరించాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. నర్సంపేట పట్టణంలోని వడ్డెర కాలనీకి చెందిన రాపోలు చింటు చోరీకి పాల్పడినట్లు గుర్తించారు. దీంతో ఖానాపురం మండల కేంద్రంలోని హనుమాన్ సెంటర్‌లో పోలీసులు శనివారం వాహనాల తనిఖీ చేపట్టగా అనుమానాస్పదంగా కనిపించిన చింటును అదుపులోకి తీసుకుని విచారించారు. చోరీకి పాల్పడినట్లు అంగీకరించాడు. 30 తులాల వెండి ఆభరణాలు, బంగారం విక్రయించగా వచ్చిన నగదులో రూ.10 వేలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

బియ్యం సాయం



సంగెం : మండలంలోని ఎల్గూర్ రంగంపేటకు చెందిన ఇమ్మడి కొమ్మాలు ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా బాధిత కుటుంబానికి స్థానిక రజక సంఘం నాయకులు శనివారం 25 కేజీల బియ్యం సాయంగా అందజేశారు. తొలుత బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు బోగి రవి, నాయకులు ఎనబోతుల ఉప్పలయ్య, రాజ్‌కుమార్, చంద్రమౌళి, లింగమూర్తి, సంపత్, కుమారస్వామి, రాజు, శ్రీధర్, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

నమ్మాళ్వార్ పరమపదోత్సవం

ఐనవోలు : కక్కిరాలపల్లిలోని లక్ష్మీనృసింహాస్వామి ఆలయంలో శనివారం రాత్రి నమ్మాళ్వార్ పరమపదోత్సవాన్ని అర్చకులు నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటరత్నం ఆచార్యులు మాట్లాడారు. శ్రీ వైష్ణవాన్ని ప్రాచుర్యంలోకి తీసుకురావడంలో కీలక పాత్ర పోషించిన విష్ణువు 12 మంది ఆళ్వార్లను అత్యున్నత భక్తులుగా పరిగణించగా ఐదో వ్యక్తిగా నమ్మాళ్వార్ పరిగణించబడ్డట్లు తెలిపారు. వైష్ణవ సాంప్రదాయంలో గొప్ప ఆధ్యాత్మికవేత్తగా సేవలు అందించాడని చెప్పారు. ఆళ్వార్లు రచించిన శ్లోకాలను అధ్యయన ఉత్సవంలో స్వామి, అమ్మవార్లకు విజ్ఞాపన చేసినట్లు వివరించారు. కార్యక్రమంలో అర్చకుడు జయకృష్ణ, భక్తులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న బ్రహ్మోత్సవాలు

దామెర : మండలంలోని ఊరుగొండ గ్రామంలో లక్ష్మీనరసింహాస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. శనివారం బిందె తీర్థం, హోమం, బలిహరణం కార్యక్రమాలను వేద పండితులు నిర్వహించారు. ఈనెల 15,16వ తేదీల్లో గ్రామ సమీపంలోని గుట్ట వద్ద జాతర ఉంటుందని, భక్తులు అధిక సంఖ్యలో తరలిరావాలని అర్చకుడు తూపు రాణి శ్రీనివాసాచార్యులు కోరారు.

వైభవంగా హనుమాన్‌పూజ

ఆత్మకూరు : మండల కేంద్రంలోని వేణుగోపాల స్వామి ఆలయంలో ధనుర్మాసోత్సవాలను పురస్కరించుకుని హనుమాన్ పూజలు వైభవంగా జరిగాయి. అర్చకుడు ఆరుట్ల మాధవమూర్తి అభిషేకాలు, చందనోత్సవం చేపట్టారు. అలాగే ఆలయంలో కూడారై మహోత్సవం నిర్వహించారు. భక్తులు తిరుప్పావై పారాయణం చేశారు. వేంకటేశ్వరస్వామి శరణాగతి దీక్షాదారులు గ్రామంలో నగర సంకీర్తన నిర్వహించారు.

జాతీయ స్థాయి 'ఇన్‌స్పైర్'కు విద్యార్థిని ఎంపిక



వర్ధన్నపేట : పట్టణంలోని ఆల్ఫోర్స్ హైస్కూల్‌లో పదో తరగతి చదువుతున్న రిస్మిత జాతీయ స్థాయి ఇన్‌స్పైర్ మనాక్‌కు ఎంపికైందని ఆ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ నరేందర్‌రెడ్డి తెలిపారు. స్కూల్ ఆవరణలో శనివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విద్యార్థినికి ఎంపిక పత్రాన్ని ఆయన ఉపాధ్యాయులతో కలిసి అందజేసి అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడారు. రాష్ట్ర స్థాయి ఇన్‌స్పైర్ మనాక్ అవార్డు స్కీంలో రిస్మిత అత్యుత్తమ ప్రతిభ కనబర్చిందని చెప్పారు. తాను రూపొందించిన ×సైక్లింగ్ ద్వారా చెత్త సేకరణ× ప్రాజెక్టు ప్రత్యేకంగా నిలిచిందని తెలిపారు. సులభమైన పరికరమని నిర్వాహకులు ప్రశంసించారని వివరించారు. దేశం శాస్త్ర, సాంకేతిక రంగాల్లో దూసుకుపోతున్న తరుణంలో విద్యార్థులు సాంకేతిక పరిజ్ఞానంపై పట్టు సాధించాలని సూచించారు.

పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



దుగ్గొండి : మండలంలోని నాచినపల్లి ప్రభుత్వ హైస్కూల్‌లో 2011–12 విద్యాసంవత్సరంలో పదో తరగతి చదువుకున్న విద్యార్థులు శనివారం సమ్మేళనం నిర్వహించారు. మిత్రులు ఒకచోట కలుసుకుని నాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. తమకు విద్యాబోధన అందించిన ఉపాధ్యాయులను శాలువాలు, పూలమాలతో ఘనంగా సత్కరించారు. ఒకరికొకరు అండగా నిలవాలని నిర్ణయించుకున్నారు.

వడ్డెర సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్‌గా మురళి

నర్సంపేట రూరల్ : తెలంగాణ వడ్డెర సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ నర్సంపేట మండలంలోని మహేశ్వరం గ్రామానికి చెందిన బొంత మురళి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో రాష్ట్ర అధ్యక్షుడు పల్లపు సమ్మయ్య ఆధ్వర్యంలో మురళిని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా మురళిని రాష్ట్ర ఎంబీసీ కార్పొరేషన్ చైర్మన్ జరపాటి జైపాల్ ఆధ్వర్యంలో ఓడ్డె ఓబన్న అవార్డుతో సన్మానించారు.

పేకాట శిబిరంపై పోలీసుల దాడి

గీసుకొండ : స్థానిక పోలీస్‌స్టేషన్ పరిధిలోని కీర్తినగర్ కాలనీలోని పేకాట శిబిరంపై టాస్క్‌ఫోర్స్ పోలీసులు శనివారం దాడి చేశారు. పేకాట ఆడుతున్న వారి నుంచి రూ.29 వేల 130 నగదు స్వాధీనం చేసుకున్నామని ఇన్‌స్పెక్టర్ ఎల్.పవన్‌కుమార్ తెలిపారు. వరంగల్ నగరంలోని కాశిబుగ్గకు చెందిన ఆరుగురు నిందితులు పరారీలో ఉన్నారని చెప్పారు. కేసును గీసుకొండ పోలీసులకు అప్పగించినట్లు పేర్కొన్నారు.

శోభాయాత్రను విజయవంతం చేయాలి

ఆత్మకూరు : ఈనెల 30న హనుమకొండలో వికాసతరంగిణి ఆధ్వర్యంలో చిన్న జీయర్‌స్వామి ప్రత్యక్ష పర్యవేక్షణలో నిర్వహించనున్న సంకీర్తన మండలి శోభాయత్రను విజయవంతం చేయాలని వికాసతరంగిణి ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ బచ్చు రాధాకృష్ణ పిలుపునిచ్చారు. మండల కేంద్రంలోని వేణుగోపాలస్వామి ఆలయంలో శనివారం వికాసతరంగిణి సమావేశంలో ఆయన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాధాకృష్ణ మాట్లాడుతూ.. ఈనెల 30న చిన్నజీయర్‌స్వామి పర్యవేక్షణలో హనుమకొండలోని పబ్లిక్‌గార్డెన్ నుంచి ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల వరకు శోభాయాత్ర నిర్వహించి, మైదానంలో స్వామి ప్రవచనాలు ఉంటాయన్నారు. సంకీర్తన మండలి సభ్యులు, కోలాటబృందాలు అధిక సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. వికాసతరంగిణి బాధ్యులు కేశవమూర్తి, మాధవమూర్తి, రాజేష్‌కుమార్, శివప్రసాద్, సాంబయ్య, సతీష్, పుష్పలీల పాల్గొన్నారు.

నర్సంపేట : సంప్రదాయ దుస్తులు, హరిదాసు, ఇతర వేషధారణలో విద్యార్థులు



ముందస్తు సంక్రాంతి సంబురాలు

సాక్షి నెట్‌వర్క్ : జిల్లాలోని నర్సంపేట, రాయపర్తి, నల్లబెల్లి, దుగ్గొండి, గీసుకొండ, చెన్నారావుపేట, తదితర మండలాల్లో సంక్రాంతి ముందస్తు సంబురాలు శనివారం కొనసాగాయి. ప్రభుత్వ, ప్రైవేట్ స్కూళ్లలో, పలు కాలనీల్లో భోగి మంటలు ఏర్పాటు చేశారు. ముగ్గుల పోటీలతోపాటు క్రికెట్ పోటీలు ఏర్పాటు చేసి విజేతలకు బహుమతులు అందజేశారు. విద్యార్థులు హరిదాసుల, ఇతరవ వేషధారణలతో అలరించారు. పతంగులు ఎగరేశారు.


నల్లబెల్లి : ముగ్గులు వేస్తున్న విద్యార్థినులు


చెన్నారావుపేటలో..


రాయపర్తి : కాట్రపల్లిలో..


దుగ్గొండిలో..


గీసుకొండలో..

'సఖి' సేవలపై అవగాహన కల్పించాలి

- కేస్ వర్కర్లు తిరుమల, స్వప్న


మాట్లాడుతున్న తిరుమల, స్వప్న

వర్ధన్నపేట : సఖి కేంద్రం ద్వారా అందుతున్న సేవలపై మహిళలకు, బాలికలకు అవగాహన కల్పించాలని వరంగల్ సఖి కేంద్ర కేస్ వర్కర్లు తిరుమల, స్వప్న సూచించారు. మండలంలోని చెన్నారం, నల్లబెల్లి గ్రామాల్లో గ్రామైక్య సంఘాల సభ్యులతో సర్వోదయ యూత్ ఆర్గనైజేషన్, సఖి కేంద్రం ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన అవగాహన కార్యక్రమాల్లో వారు మాట్లాడారు. సఖి సెంటర్ ద్వారా మహిళలకు, పిల్లలకు అనేక సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. మహిళల, బాలికల రక్షణ కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సఖి సెంటర్లను నిర్వహిస్తున్నాయని చెప్పారు. బాధిత మహిళలకు కౌన్సెలింగ్ చేయడంతోపాటు వసతి కల్పిస్తారని, ఇతర పలు రకాల సేవలు అందుతాయని తెలిపారు. సఖి సేవలు 24 గంటలూ అందుబాటులో ఉంటాయన్నారు. అత్యవసర పరిస్థితుల్లో మహిళలు హెల్ప్‌లైన్ నంబర్ 181కు కాల్ చేస్తే రక్షణ లభిస్తుందని చెప్పారు. గృహహింస, బాల్య వివాహాల నిరోధక, పోక్సో, తదితర చట్టాలతోపాటు హక్కులపై మహిళలు, బాలికలు చైతన్యవంతం కావాలని కోరారు. డయల్ 100, 181, 1098, 14567పై అవగాహన కల్పించారు. కార్యక్రమాల్లో సీసీ స్వామి, బీఓఏలు శైలజ, దయాకర్, తదితరులు పాల్గొన్నారు.

అవగాహనతో అక్రమ రవాణాకు అడ్డుకట్ట


వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న సీఐ, తదితరులు

నర్సంపేట రూరల్ : ప్రజల్లో అవగాహన పెంచడం ద్వారా మానవ అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయగలమని స్థానిక టౌన్ సీఐ రమణమూర్తి స్పష్టం చేశారు. మానవ అక్రమ రవాణా నివారణ దినోత్సవం సందర్భంగా స్వయంకృషి సోషల్ వర్క్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో ఎఫ్ఎంఎం సోషల్ సర్వీస్ సొసైటీ సహకారంతో ముద్రించిన వాల్‌పోస్టర్లు, కరపత్రాలను పట్టణంలోని పోలీస్‌స్టేషన్‌లో శనివారం ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. మానవ అక్రమ రవాణాను అరికట్టేందుకు సమాజంలోని ప్రతిఒక్కరూ కృషి చేయాలని చెప్పారు. అపరిచితుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, అనుమానితులు తారసపడితే డయల్ 100కు ఫోన్ చేయాలని, ఆడపిల్లలు చైల్డ్ హెల్ప్‌లైన్ 1098కు సమాచారం అందించాలని కోరారు. కార్యక్రమంలో ఎస్సై రవికుమార్, కన్జ్యూమర్ ఫోరం జిల్లా అధ్యక్షుడు గిరగాని సుదర్శన్, స్వయంకృషి సంస్థ నిర్వాహకుడు బెజ్జంకి ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగురాలికి సాయం



రాయపర్తి : మండల కేంద్రానికి చెందిన దివ్యాంగురాలు అనారోగ్యంతో బాధపడుతుండగా ఆమెకు ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రతినిధి, ఎస్టీ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు భూక్య సురేందర్ నాయక్ రాథోడ్ శనివారం రూ.25 ఏవల సాయం అందజేశారు. అనంతరం సురేందర్ మాట్లాడారు. దివ్యాంగురాలు అనారోగ్యంతో బాధపడుతున్న విషయాన్ని ఫౌండేషన్ చైర్మన్, బీఆర్ఎస్ జిల్లా నాయకుడు పరుపాటి శ్రీనివాస్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా స్పందించి రూ.25 వేల సాయం అందజేశారని తెలిపారు. కార్యక్రమంలో ఫౌండేషన్ ప్రతినిధులు గజవెల్లి ప్రసాద్, కోల సంపత్, అశ్రఫ్ పాషా, నేతావత్ శ్రీధర్, దేదావత్ ఉపేందర్, గట్టు ప్రవీణ్, కోట భిక్షపతి, హుస్సేన్, పర్వతాలు, సల్మాన్ తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ



రాయపర్తి : మండలంలోని పెర్కవేడుకు చెందిన కాంగ్రెస్ నాయకుడు ఎడ్లపెల్లి నరేందర్‌రావు అనారోగ్యంతో బాధపడుతుండగా ఆయన్ను ఆ పార్టీ మండల అధ్యక్షుడు ఈదులకంటి రవీందర్‌రెడ్డి శనివారం పరామర్శించారు. అనంతరం పానిష్‌తండాలో రోడ్డు ప్రమాదంలో గాయపడిన భూక్య సైదానాయక్‌ను పరామర్శించారు. అలాగే శివరామపురం గ్రామానికి చెందిన ఓరుగంటి మృతి చెందగా ఆమె మృతదేహానికి నివాళులర్పించారు. కొత్తూరులో చిర్ర ముత్తయ్య అనారోగ్యంతో మృతి చెందగా బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. కార్యక్రమాల్లో మార్కెట్ కమిటీ డైరెక్టర్ పుల్లూరి దామోదర్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బొమ్మెర కల్యాణ్, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు చిర్ర మలయ్య, తదితరులు పాల్గొన్నారు.